పేరుకే.. బస్టాండ్

- అక్కడకు రాని బస్సులు
- 19 ఏళ్లుగా నిరుపయోగం
- దుస్థితిలో ఏడిద రోడ్డు బస్టాండ్



నిరుపయోగంగా ఏడిద రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్

కపిలేశ్వరపురం (మండపేట): బస్టాండ్ అనగానే గమ్యాన్ని సూచించే బస్సు సిద్ధంగా ఉండాలని కోరుకుంటాం. ఏమైనా కాస్త ఆలస్యం అవుతుందనుకుంటే వేచి ఉండేందుకు తగిన సదుపాయాలు ఉండాలనుకుంటాం. ఎండ, వాన నుంచి రక్షణ పొందాలనుకుంటాం. మండపేటలోని నూతన బస్టాండ్‌లో ఇవేమీ కనిపించవు. అక్కడ నిలబడితే అసలు బస్సే రాదు. సుమారు 19 ఏళ్ల క్రితం ఆర్భాటంగా ప్రారంభించిన ఏడిద రోడ్డులోని నూతన బస్టాండ్ నిర్వహణ అప్పట్లో కొద్ది రోజులు మాత్రమే నడిచింది. నేటికీ పట్టణంలోని ప్రధాన రహదారిలో ఇరుకుగా ఉన్న ఆర్టీసీ పాత బస్టాండ్‌నే వినియోగిస్తున్నారే తప్ప కొత్త బస్టాండ్‌కు బస్సులే రావట్లేదు. ఇదీ ఏడిద రోడ్డులో ఉన్న బస్టాండ్ దుస్థితి.

మండపేట పట్టణ ప్రాధాన్యం ఇదీ

మండపేట, అనపర్తి, కొత్తపేట, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాల ప్రజలకు మండపేట పట్టణం ప్రధాన కేంద్రంగా ఉంది. దానికి తోడు పౌల్ట్రీ, రైస్‌మిల్లు ఇతర పరిశ్రమలకు కేంద్రంగా పట్టణం వర్ధిల్లింది. పట్టణానికి వచ్చిపోయే ప్రజలు, వాహనాలు దానికి తగినట్టే ఉంటాయి. దీర్ఘకాలంగా మండపేట మెయిన్ రోడ్డులోని బస్ షెల్టర్ మీదుగానే ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగుతూ వచ్చాయి. మారిన రోజులు కారణంగా పట్టణానికి రద్దీ మరింత తీవ్రమైంది.

రూ.20 లక్షలతో నిర్మాణం

పట్టణ ప్రధాన రహదారిలోని బస్టాండ్ ఇరుకుగా ఉండటంతో పట్టణంలోని ఏడిద రోడ్డులో రెండెకరాల విస్తీర్ణంలో సుమారు రూ.20 లక్షల వ్యయంతో వేగుళ్ల సూర్యారావు బస్ స్టేషన్ నిర్మించారు. 1999 ఏప్రిల్ 4న అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. 2005 ఆగస్టు 22న మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి బస్ స్టేషన్‌ను ప్రారంభించారు. అప్పటి రోజుల్లో ఆర్టీసీ బస్సులను కొత్తగా నిర్మించిన ఏడిద రోడ్డు బస్టాండ్ మీదుగానే సర్వీసులను నడిపారు. పట్టణ ప్రధాన రహదారులకు మూలంగా ఏడిద రోడ్డు బస్టాండ్ నిర్మించడంతో ఆచరణలో ప్రయాణికులకు సమస్యగా మారింది. బస్సు కోసం స్టాండ్‌కు వెళ్లడం అవస్థలమయమైంది. కొంత కాలానికి ఆర్టీసీ అధికారులు ఏడిద రోడ్డులోని బస్టాండ్ వైపు సర్వీసులను రద్దు చేసి ప్రధాన రహదారిలోని బస్టాండ్ మీదుగా కొనసాగించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల కోరికపై కొంత కాలం రాజమహేంద్రవరం వైపు వెళ్లే బస్సులను ఏడిద రోడ్డు బస్టాండ్ మీదుగా నడిపారు. తర్వాత మొత్తం సర్వీసులను రద్దు చేశారు. సుమారు 19 ఏళ్లుగా ఏడిదరోడ్డు బస్టాండ్ నిరుపయోగంగా ఉంది. ఇన్నేళ్లలో పట్టణ విస్తీర్ణం, ప్రయాణికుల రాకపోకలు, రద్దీ పెరిగాయి. విలువైన స్థలంలో రూ.లక్షలు పోసి నిర్మించిన బస్ షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

నిర్వహణలో ఉన్న పాత బస్టాండ్‌లోనూ సమస్యలే

మండపేట పట్టణం నడిబొడ్డున జొన్నాడ–కాకినాడ ప్రధాన రహదారిలో ప్రస్తుతం బస్టాండ్ నిర్వహణలో ఉంది. రావులపాలెం నుంచి కాకినాడ, సామర్లకోట వెళ్లే బస్సులు, సామర్లకోట, కాకినాడ నుంచి రావులపాలెం, విజయవాడ వెళ్లే బస్సులు వచ్చిన రూటులోనే యథేచ్ఛగా రాకపోకలు సాగించే వీలుంది. రామచంద్రపురం– రాజమహేంద్రవరం రాకపోకలు సాగించే బస్సులు బస్టాండ్ వద్ద మలుపు తిరిగి బస్ షెల్టర్‌లోకి వెళ్లాల్సి వస్తుంది. ఆ క్రమంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. బస్ షెల్టర్ చిన్నది కావడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రావులపాలెం వైపు వెళ్లే ప్రయాణికులకు షెల్టర్ సదుపాయం లేదు. ఎండ, వానలోనే బస్సు కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

క్లుప్తంగా

భారత సైన్యానికి సంఘీభావంగా ర్యాలీ



హసన్‌బాద ర్యాలీలో సర్పంచ్, విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: పహల్గామ్ ఉగ్రదాడి వెనుక ప్రధాన సూత్రధారి అయిన ఉగ్రవాదితోపాటు మరో ఇద్దరు ఉగ్రవాదులను తుదముట్టించిన భారత సైన్యానికి సంఘీభావంగా హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, భారత సైన్యం ఆపరేషన్ మహాదేవ్ చేపట్టి ఉగ్రవాదులను అంత మొందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలి

కపిలేశ్వరపురం (మండపేట): అనధికార లేఅవుట్లలో స్థలాలను కొనుగోలు చేసిన వారు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ద్వారా ఏపీ ప్రభుత్వం అనధికార లేఅవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరణ రూల్స్ - 2020ను సవరిస్తూ జీఓ 134 జారీ చేసిందన్నారు. ఆ జీవో ప్రకారం ఈ ఏడాది జూన్ 30కి ముందు అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు జూలై 26 నుంచి 90 రోజుల్లో క్రమబద్ధీకరణ కోసం ఆన్‌లైన్‌లో ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువలో 14 శాతం సొమ్మును, పీనలైజేషన్ చార్జీలను చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకుని వినియోగదారులు తమ ప్లాట్లను క్రమబద్ధం చేసుకోవచ్చని కమిషనర్ రంగారావు తెలిపారు.

సమస్యల ఏకరువు

కాజులూరు: మండలంలోని తిప్పరాజుపాలెం, అయితపూడి తదితర గ్రామాల్లో మంగళవారం కూటమి నాయకులు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులకు ప్రజలు సమస్యలు పరిష్కరించాలని ఏకరువు పెట్టారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రామచంద్రపురం: అనారోగ్యంతో బాధపడుతున్న 31 మంది నిరుపేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.29.61 లక్షల చెక్కులను మంత్రి సుభాష్ పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారు ప్రజాప్రతినిధుల సిఫార్సుతో వైద్య ఖర్చుల నిమిత్తం వీటిని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహిళలు పరిశ్రమలు స్థాపించాలి



మహిళకు ముద్ర రుణం అందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం డ్వాక్రా సంఘాల మహిళలతో మంత్రి సుభాష్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. శ్రీనిధి కమ్యూనిటీ ఇన్వెస్టిమెంట్ ఫండ్, ప్రధానమంత్రి ఉపాధి కల్పన, ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్, భారతీయ లఘు పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు తదితర సంస్థలు అందించే రుణాలు పొంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ జైచంద్ర గాంధీ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు ఉన్నతి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎల్‌డీ ఎం.కేశవ వర్మ మాట్లాడుతూ, ఎంఎస్‌ఎంఈ యూనిట్లు నెలకొల్పేందుకు రుణాల కల్పన జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన స్కీం ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు పొంది యూనిట్లు స్థాపించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దేవరకొండ అఖిల, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జెడ్.మేడపాడు పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణస్వీకారం

కపిలేశ్వరపురం (మండపేట): జెడ్. మేడపాడు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో చైర్మన్‌గా సలాది బాలసుబ్రహ్మణ్యం, సభ్యులుగా సంగిశెట్టి అమ్మన్న, బోయిడి వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, వైస్ ఎంపీపీ గజ్జరపు వెంకటరమణ, సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



వైఎస్ జగన్‌తో ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కపిలేశ్వరపురం మండలం కేదారిలంక ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరావు తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ద్వారా తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో యర్రంశెట్టి నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, ఉప సర్పంచ్ యర్రంశెట్టి సత్తిబాబు, యర్రంశెట్టి నాగేంద్ర కలిశారు.

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మండపేటకు చెందిన పార్టీ యువజన విభాగం కన్వీనర్ చోడే శ్రీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ద్వారా యువజన విభాగం ద్వారా చేపట్టిన కార్యక్రమాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించినట్టు శ్రీకృష్ణ తెలిపారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రయోగాత్మక విద్యా బోధన



రాయవరం ఉన్నత పాఠశాల తరగతి గదుల్లో విద్యార్థుల విద్యాస్థాయిని పరీక్షిస్తున్న డీఈవో డాక్టర్ సలీం బాషా

డీఈవో డాక్టర్ సలీం బాషా

రాయవరం: పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ బాలబాలికలకు నాణ్యమైన విద్య అందించడమే కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పీఎంశ్రీ పథకం లక్ష్యమని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా పేర్కొన్నారు. రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ విద్యా విధానం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పీఎంశ్రీ పాఠశాలను జాతికి అంకితం చేసిన అనంతరం డీఈవో మాట్లాడుతూ పీఎంశ్రీ పథకంలో జిల్లాలో మూడు విడతల్లో 28 పాఠశాలలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పాఠశాలలకు మూడేళ్లలో రూ.1.17కోట్లు మౌలిక సదుపాయాల కల్పనకు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. పీఎంశ్రీ పాఠశాలలను మోడల్ స్కూళ్లగా చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. కేవలం తరగతి గదులు, పాఠ్య పుస్తకాలతో కూడిన మూస విద్యాభ్యాసానికి భిన్నంగా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపుదలకు వీలుగా పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రయోగాత్మక విద్యా బోధన సాగుతుందన్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో రసాయన, భౌతిక, బయాలజీ ల్యాబ్స్ గదుల నిర్మాణాలు, కంప్యూటర్ విద్య, లైబ్రరీ గదులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. వృత్తి విద్యకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020ని జూలై 29న అమలు చేసిందని, అందులో భాగంగానే ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పేరుతో ప్రతి జిల్లాలో విడతల వారీగా కొన్ని పాఠశాలలను ఎంపిక చేశారని తెలిపారు. ఎన్‌ఈపీ 2020 ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్‌ఈపీ–2020లో భాగంగా అభివృద్ధి చేసిన పీఎంశ్రీ పాఠశాలల్లో జిల్లాకు ఒక పాఠశాలను ఎంపిక చేసి జాతికి అంకితమిచ్చినట్లు తెలిపారు. హెచ్‌ఎం వీఎస్ సునీత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి, ఎంపీడీవో ఎస్.కీర్తిస్పందన, ఎస్‌ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం డీఈవో ఉన్నత పాఠశాలలో తరగతులను సందర్శించి, విద్యార్థుల విద్యాస్థాయిని పరిశీలించారు.

స్పీడ్ బ్రేకర్ల టెండర్లకు బ్రేక్



కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్, కమిషనర్

రామచంద్రపురం: పట్టణంలోని 28 వార్డులో స్పీడ్ బ్రేకర్స్ నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ఆమోదానికి కౌన్సిల్ సభ్యులు బ్రేక్ వేశారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అజెండాలో 12, 13వ అంశంగా పేర్కొన్న వార్డుల్లో స్పీడ్ బ్రేకర్ల నిర్మాణానికి ఒక్కొక్క స్పీడ్ బ్రేకర్ చదరపు మీటరు నిర్మాణానికి రూ.5,300 చొప్పున ప్రతిపాదిస్తూ చేసిన అంశంపై సమావేశంలో కౌన్సిలర్‌లు వాడ్రేవు సాయిప్రసాద్, అంకం శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. చదరపు మీటరుకు రూ.3 వేలు అదనంగా వేశారని, అంత ఖర్చు జరగదన్నారు. 12, 13 అంశాలను తిరస్కరిస్తూ రీటెండర్లు పిలవాలని తీర్మానించారు. 14వ అంశం మేజర్ డ్రైన్‌లో సిల్ట్ తీసి వెల్ల వాడర్ వర్క్స్‌కు తరలించడానికి, 15వ అంశం త్యాగరాజు నగర్‌లో మేజర్ డ్రైనల శ్లాబ్ కవర్ల నిర్మాణానికి ప్రతిపాదించిన టెండర్లను తిరస్కరిస్తూ రీటెండర్లు పిలవాలని తీర్మానించారు. నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం లేనందున తిరస్కరించాలని వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, వాడ్రేవు సాయప్రసాద్ కోరారు. రూ.15.40లక్షల ఆర్థిక సంఘం నిధులతో పారిశుధ్య కార్మికలకు రక్షణ పరికరాలు, తోపుడు బళ్ల కొనుగోలుకు ఆమోదం తెలిపారు. రూ.4.70 కోట్లతో పట్టణంలో డ్రైన్‌ల నిర్మాణానికి, రూ.25 లక్షలతో శ్మశన వాటిక అభివృద్ధికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పాత బస్టాండ్ అన్నపూర్ణ సెంటర్‌లో సులభ్ కాంప్లెక్స్ రిపేర్లకు రూ.3.58లక్షలు ఆమోదం తెలిపారు. జీరో అవర్‌లో మున్సిపల్ డీఈ శ్రీకాంత్ తీరుపై జనసేన కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. డీఈ శ్రీకాంత్‌పై పలు ఆరోపణలు చేశారు. డీఈ, కౌన్సిలర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్‌లు, కమిషనర్ కేవీఆర్ఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



యర్రగుంట అయ్యప్ప

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మండపేట 18 కౌన్సిలర్ యర్రగుంట మణికంట కుమార్ (అయ్యప్ప) అన్నారు. తన నియామకానికి అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు మంగళవారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పర్యవేక్షణలో పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టపర్చేందుకు పాటుపడతానని అయ్యప్ప అన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం (మండపేట): విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టిన నేపథ్యంలో మండపేట రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్టు రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు మంగళవారం తెలిపారు. ఏడిద, ఏడిద సీతానగరం, ఏడిద కొత్తూరు, ఏడిద సావరం గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు.

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడి



పేకేటిపాకలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కపిలేశ్వరపురం (మండపేట): శాస్త్రీయ పద్ధతిలో సాగు చేయడం ద్వారా పెట్టుబడులను తగ్గించుకుని అధిక దిగుబడులను సాధించవచ్చని ఆలమూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీవీ చౌదరి అన్నారు. మండపేట మండలం పేకేటిపాకలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ క్షేత్రంలోని పరిస్థితులను ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి కె. ప్రభాకర్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయాధికారులు పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మిత్ర పురుగులకు హాని కలగకుండా పురుగు మందులను వాడాలన్నారు. ప్రతి రైతు తాను సాగు చేస్తున్న పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, రైతులు వాసంశెట్టి గోవింద్ గారు, వ్యవసాయ విస్తరణాధికారి వసుం బాలకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు రత్నకుమార్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు



నేలటూరు సచివాలయంలో చిన్నారులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కపిలేశ్వరపురం: ఆర్‌బీఎస్‌కే రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.విజయదీపిక ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని చిన్నారులకు ప్రత్యేక వైద్య పరీక్షలను చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని కాలేరు, వడ్లమూరు, నల్లూరు, వెదురుమూడి, వల్లూరు, నేలటూరులోని చిన్నారుల ఎత్తు, బరువు, ఆరోగ్య పరిస్థితులను నమోదు చేశారు. కార్యక్రమాన్ని ఎంపీహెచ్‌ఈఓ సీహెచ్.గోపాలకృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు సేవలందించారు.

సీసీ రహదారులు ఛిద్రం



మండపేటలో ఛిద్రమైన సీసీ రహదారి, డ్రెయిన్

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని 8వ వార్డుతో పాటు పలు వార్డుల్లో సీసీ రహదారులు ఛిద్రమయ్యాయని కనీసం వాటికి మరమ్మతులు చేయాలని 8వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ మంగళవారం డిమాండ్ చేశారు. మరమ్మతు పనులకు సుమారు మూడు నెలల క్రితం రూ.17 లక్షలు మంజూరైనప్పటికీ పనులు మున్సిపల్ అధికారులు చేపట్టకపోవడం సరికాదన్నారు. మందపల్లి యాకోబు నివాసం వద్ద సీసీ రహదారి, డ్రెయిన్లు ఛిద్రమయ్యాయన్నారు. రామాలయం గుడి పక్కన, బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద సీసీ రహదారులు ఛిద్రమయ్యాయని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని రవి కుమార్ కోరారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి



వేగాయమ్మపేటలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

రామచంద్రపురం రూరల్: రైతులు తమకు ఉన్న భూమిలో కనీసం 20 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని రామచంద్రపురం ఏడీఏ వి.నాగకుమార్ సూచించారు. మండలంలోని వేగాయమ్మపేటలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ఎరువుల వాడకం తగ్గించాలని కోరారు. అవసరం మేరకు మాత్రమే పురుగు మందులు వాడాలని కోరారు. ఏఓ టీవీఆర్ మణిదీప్ మాట్లాడుతూ, రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని కోరారు. అదే విధంగా క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం ఆగస్టు 15లోగా చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నైతిక విలువలతోనే మెరుగైన సమాజం

కపిలేశ్వరపురం (మండపేట): ప్రతి ఒక్కరూ నైతిక విలువలతో కూడిన జీవనం సాగిస్తే మెరుగైన సమాజాన్ని రూపొందుతుందని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఓ) రాష్ట్ర కార్యదర్శి వసీం అన్నారు. మండపేటలో మంగళవారం ఎస్ఐఓ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వసీం మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నైతిక విలువలపై అవగాహన తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఓ అధ్యక్షుడు తల్హా, కార్యదర్శి హసిబ్, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత ఫిజియోథెరపీ సేవలు



ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న వైద్యులు

రామచంద్రపురం రూరల్: మండలంతోపాటు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని ప్రజలకు ఉచిత ఫిజియోథెరపీ సేవలు ఎంతో మేలు చేకూర్చుతున్నాయని రాజారత్న కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు డాక్టర్ వీరమల్ల పద్మజ మహాలక్ష్మి, డాక్టర్ గుడాల భవాని, డాక్టర్ వి.మాలతి అన్నారు. మండలంలోని అంబికపల్లి అగ్రహారంలో రాజారత్న అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ సెంటర్ అండ్ జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత సేవలు నిర్వహిస్తున్నామన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతో పూర్తిగా ఉచితంగా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజారత్న యాజమాన్యం సూచిస్తున్నారు.

సర్జరీ లేకుండా నొప్పి తగ్గింది



చాలా కాలంగా నడుం నొప్పితో ఇబ్బంది పడుతున్నాను. చివరికి నడుముకు ఆపరేషన్ పడుతుందని వైద్యులు సూచించడంతో ఆపరేషన్‌కు సిద్ధపడ్డాను. అదే సమయంలో ఓ స్నేహితుడు ఈ కళాశాల గురించి చెప్పి ఒక ప్రయత్నం చేయమని చెప్పాడు. అప్పటికీ తగ్గకపోతే ఆపరేషన్ చేయించుకో అని చెప్పడంతో 25 రోజులపాటు ఫిజియోథెరపీ చేయించుకున్నాను. ఆశ్చర్యకరంగా ఆపరేషన్ అవసరం లేకుండానే నడుం నొప్పి తగ్గిపోయింది.

– జుత్తిగ మాధవస్వామి, వీఆర్ఓ, రామచంద్రపురం

ఉచితంగానే సేవలు



ఫిజియోథెరపీ అవసరమయ్యే ఆర్థో, న్యూరాలజీ, పీడియాట్రిక్, కార్డియాలజీ, ఉమెన్ హెల్త్, ప్రెగ్నెన్సీ కేసులు, ఆపరేషన్‌కు ముందు, ఆపరేషన్ తరువాత అవసరమయ్యే రిహాబిలిటేషన్ చికిత్సలు పూర్తిగా ఉచితంగానే అందిస్తున్నాం. ఎక్కువ మంది ఇబ్బంది పడే మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పులు, ఎముకలు, నరాలకు సంబంధించి ఇబ్బందులు, ఫెరాలసిస్ కేసులకు చికిత్సలు అందిస్తున్నాం.

– డాక్టర్ పద్మజ మహాలక్ష్మి, రాజారత్న కాలేజీ ప్రిన్సిపాల్, హెచ్ఓడీ.

ఆయిల్‌పామ్ సాగుకు పతంజలి సహకారం



వేములపల్లిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే

కపిలేశ్వరపురం (మండపేట): వేములపల్లిలో మంగళవారం ఉద్యాన శాఖ, పతంజలి ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ తోటల విస్తరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు ఆయిల్ పామ్ మొక్కలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమం ప్రారంభ సూచికగా ఎమ్మెల్యే తదితరులు మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు ముందుకొచ్చిన రైతులకు పతంజలి సంస్థ ద్వారా ఉచితంగా మొక్కలు సరఫరా చేస్తారన్నారు. రైతులకు హెక్టారుకి రూ.29,000, నిర్వహణ కోసం రూ.21,000, అంతర పంటల సాగు కోసం రూ.21,000 ప్రభుత్వ ద్వారా సాయమందుతుందన్నారు. చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో గుంతలు తవ్వి మొక్కలు నాటే పనులను ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేస్తామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఆయిల్ పామ్ గెలలను రైతులు అమ్ముకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ జీవీవీ ప్రసాద్, పతంజలి ఏజీఎం రవీంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ అనూష పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌లో వ్యక్తి మృతదేహం

ఐ. పోలవరం: కొమరగిరి బైపాస్ రోడ్డు పక్కన బస్ షెల్టర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం (60) లభ్యమైంది. కొమరగిరి వీఆర్వో శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై రవీంద్రబాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచినట్లు ఎస్సై మంగళవారం తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే ఐ.పోలవరం పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కాజులూరు: ఇంటర్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ, 2024–25 విద్యాసంవత్సరంలో తమ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించిందన్నారు. తమ విద్యార్థి యాళ్ల వెంకటదుర్గా సత్యేశ్వర్ ఈ ఏడాది జిల్లా బాలుర విభాగంలో ప్రథమ స్థానం సాధించి అమరావతి వద్ద బీటెక్ కంప్యూటర్స్‌లో ఫ్రీ సీటు సాధించాడన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో బైపీసీలో కట్టా శిరీషా 440కి 435 మార్కులు సాధించిందన్నారు. గతేడాది 85 అడ్మిషన్లు జరగగా.. ఈ ఏడాది 118 అడ్మిషన్లు జరిగాయని ఇంకా ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులకు ఈనెల 31 చివరి తేదీ అన్నారు.